


మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 51 పేజీలు : 8 వెల : రూ.2/- గురువారం 19 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




**పాఠకులకు శ్రేయోభిలాషులకు మరియు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు**

పాఠకులకు శ్రేయోభిలాషులకు మరియు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అధికారులు అనధికారులకు శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు మీ డాక్టర్ వై వివేకానంద యాదవ్ మన జనప్రగతి తెలుగు దినపత్రిక న్యూస్ అలెర్ట్ ఇంగ్లీష్ దినపత్రిక ఎడిటర్ మరియు ఎండి ఉగాది పర్వదినాని పురస్కరించుకొని నేడు మా కార్యాలయం సెలవు కనుక శుక్రవారం మా పత్రికలు వెలబడవు తిరిగి శనివారం మీ ముందుకు మన జనప్రగతి తెలుగు దినపత్రిక న్యూస్ అలెర్ట్ ఇంగ్లీష్ దినపత్రికలు వెలుపడతాయి.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

- దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన సిఎం
- 12.75 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని వెల్లడి





**అమరావతి,మన జనప్రగతి మార్చి 18:**దివ్యాంగ శక్తి పథకం ద్వారా లక్షల మందికి మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్దిదారులతో సీఎం మాట్లాడారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో ప్రయాణించటం ఆనందంగా ఉందని చంద్రబాబు అన్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వారని తెలిపారు. గతంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని ప్రస్తావించారు. ట్రైసైకిళ్లతో పాటు మిగతా2లో...

## ప్రజా సేవలో పదవీ విరమణ లేదు


- రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 18:**రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. మిగతా2లో...

## ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

- త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు
- సిబ్బంది నియామకం పనులు పూర్తి
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 18:** త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మిగతా2లో...

## ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

- ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు
- కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది
- పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు



**విశాఖపట్నం,మన జనప్రగతి మార్చి 18:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో మిగతా2లో...



## ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

నాలుగు అంతస్థుల భవనం అగ్నికి ఆహుతి

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 18:** ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు మిగతా2లో...

## ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది శుభాకాంక్షలు




## అల్పపీడన ప్రభావంతో ఎపిలో భారీ వర్షాలు


పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు



**విశాఖపట్నం,మన జనప్రగతి మార్చి 18:** అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖపట్నం కేంద్రంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆగ్నేయ, మిగతా2లో...

## అనుకున్న సమయానికి పోలవరం పూర్తి

- గత పాలకలు తీరుతో ప్రాజెక్టులో జాప్యం
- నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం
- నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత



**అమరావతి,మన జనప్రగతి మార్చి 18:** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 -03-2026

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ పక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళ్తుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం నాడు కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏళ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోదీని పెళ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. దేవెగౌడ 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత సుమారు ఒక ఏడాది పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతిచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హెచ్‌డీ దేవెగౌడ 'జేడీఎస్'తో కాంగ్రెస్ పొత్తు సాగించింది. ఆ కూటమి విజయం సాధించింది. దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2019లో పలువురు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకుంది. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసు కున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా ఛలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోదీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అంటూ చమత్కరించారు.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చుని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికం గా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# అనుకున్న సమయానికి పోలవరం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 -7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## జిల్లా బిజెపి కార్యాలయాల్లో ఉగాది వేడుకలు

- పార్టీ శ్రేణులకు అధ్యక్షుడు మాధవ్ సూచన



**అమరావతి,మన జనప్రగతి మార్చి 18:** ఉగాది పర్వదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశర చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా నేతలు, కార్యకర్తలతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీజేపీ కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యాలయంలో పురోహితులను పిలిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా జరగాలని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోని ముఖ్యమైన గ్రామ దేవతలను పార్టీ నాయకులు సందర్శించాలని మాధవ్ సూచించారు. గ్రామ దేవతలకు పార్టీ తరపున సంప్రదాయబద్ధంగా సారె సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక ప్రజలతో కలిసి ఈ వేడుకలు జరపాలని ఆదేశించారు. కొత్త అమావాస్య, ఉగాది సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు.. ప్రజలతో మమేకమై చేయాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి



**టెహ్రాన్,మన జనప్రగతి మార్చి 18:** సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నామని స్పష్టం చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే దివ్యాంగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో ఇప్పుడు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎలాంటి ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. ఈ సౌకర్యం ద్వారా నెలకు ఒక్కొక్కరికీ రూ.2 వేల దాకా దివ్యాంగులకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత ఆనందంగా చేసుకోవాలన్నారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమేనని చెప్పుకొచ్చారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళల స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని ప్రస్తావించారు. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మందకృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు విఎంఆర్‌డిఏ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ పక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్‌ఎ÷-లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది. అయితే బిల్డింగ్‌లోని టాప్ రెండు ఫోర్లలో ఆ ఇంటి యజమానులు ఉంటున్నారు. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. పాలంకు చెందిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. 20 ÷ర్ టెండర్లు, 11 సీఏటీఎస్ అంబులెన్సులు, బీఎస్ఈఎస్ , ఎయిర్ ఫోర్స్ పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం చేరుకున్నది. స్థానిక పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

# ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 18:** తెలుగు ప్రజలను ప్రముఖులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. కొత్త సంవత్సరంలో అంతా శుభం జరగాలని ఆకాంక్షించారు. గవర్నర్లు అబ్దుల్ నజీర్, శుక్లా, సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, విపక్ష నేతలు కెసిఆర్, జగన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోడీ కూడా తెలుగు ప్రజలకు ఉగాధి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటినుంచిశ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

# అల్పపీడన ప్రభావంతో ఎపిలో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

నైరుతి దిశల నుంచి గాలులు బలంగా వీస్తాయని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రాబోయే మూడు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులకు పలు కీలక సూచనలు చేసింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా అమలాపురం, తణుకు, రాజోలు, భీమవరం, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, నంద్యాల పరిసర ప్రాంతాలు, ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నూజివీడు ప్రాంతంలో ఇప్పటికే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించనున్నాయి. ఏలూరు జిల్లా, పరిసర ప్రాంతాల్లో సుమారు 35,000 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఈదురుగాలుల కారణంగా మామిడి పూత రాలిపోతోంది. మామిడి పిందెలు నేలపై పడిపోతున్నాయని, దీనివల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు కొన్ని సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపుల సమయంలో బయటకు వెళ్లవద్దని తెలిపారు. చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 -03-2026

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ



**నెల్లూరు మన జనప్రగతి మార్చి 18:**–తెలుగు లోగిళ్లలో కొత్త వెలుగులు నింపే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు .ఉగాది పచ్చడిలోని షడ్రుచుల లాగా జీవితంలోని కష్టసుఖాలను ధైర్యంగా స్వీకరిస్తూ రాష్ట్ర ప్రగతిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.ఈ ఏడాది ప్రజలందరికీ గొప్ప విజయాలను అందించాలని మంత్రి అభిలషించారు.

## పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

● అల్ మేవాను అభినందించిన జిల్లా కలెక్టర్




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 18:**–ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఆల్ మైనారిటీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణి కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండుగను సంతోషంగా జరుపుకోలేని స్థితిలో ఉన్న సుమారు 200 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి లబ్ధిదారునికి రూ.600 విలువైన నిత్యావసర సరుకులు (బియ్యం, కిరాణా) మరియు పాలు, స్వీట్లు వంటి పండుగ ఖర్చుల కోసం రూ.400 నగదును కలిపి మొత్తం రూ.1000 విలువైన తోఫాను అందచేయడం జరిగిందన్నారు. పేదలను ఆదుకోవడం పుణ్య కార్యక్రమమని ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహ పర్వీన్, జిల్లా ముస్లిం మైనారిటీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ముక్తియార్ బాషా, జనరల్ సెక్రెటరీ రియాజ్ బాషా, వైస్ ప్రెసిడెంట్ జాకిర్ హుస్సేన్, ఫైనాన్స్ సెక్రెటరీ షఫీ అహ్మద్, ఉమెన్ సెక్రెటరీ సహారా భాను, స్టేట్ కౌన్సిల్ మెంబర్ జమీల్ ఉద్దీన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సఫియుల్లా బైగ్, అబ్దుల్ కాలిక్, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి విలువద్య పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానం




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 18:**– జాతీయ స్థాయి విలువద్య పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్. శంకర్ శర్మ సన్మానించారు. బుధవారంకర్నూలు కు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. గుంటూరు లో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు జాతీయ స్థాయి విలువిద్య పోటీలు కొనసాగుతున్నాయి. ఈపోటీలకు కర్నూలు జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనారు. వీరిని డాక్టర్ శంకర్ శర్మ కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో సన్మానించి జాతీయ స్థాయిలో కర్నూలు కు గుర్తింపు తీసుకుని రావాలని కోరారు. ఈసందర్భంగా విలువిద్య క్రీడ గొప్ప తనాన్ని డాక్టర్. శంకర్ శర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి భూపతి రావు,ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీనాగరత్నమయ్య, కోచ్ వంశీ కృష్ణ, భరత్ఎన్. గునిత్ రెడ్డి, క్రీడాకారులు కే.అవంతిక, ఎస్. ఇశాంత్, అద్విత, బీ. ఆద్యా, వర్షిణి పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 18:**–జిల్లా కలెక్టర్ రాష్ట్ర మంత్రి టీజీ భరత్,డా.ఏ.సిరి జిల్లా ప్రజలకు వేరువేరుగా తెలుగు నూతన సంవత్సరాది ఉగాది మరియు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ ఉగాది ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ ఏడాది సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులకు మేలు కలగాలని, అన్ని వర్గాల ప్రజలూ ఆనందంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.**రంజాన్ పండుగ శుభాకాంక్షలు.** పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా, అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం గడిపిన ముస్లిం సోదర సోదరీమణులందరికీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని, దీక్షలు, ఉపవాసాలు, దైవారాధన, దానధర్మాలు, చెడును త్యజించడం, సాటి మానవులకు సేవ వంటి సత్కార్యాల ద్వారా అల్లాహ్ స్మరణలో తరింప చేసిన రంజాన్ పండుగను ముస్లిం సోదర సోదరీమణులందరూ సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని రాష్ట్ర మంత్రి, కలెక్టర్ కాంక్షించారు.

## దివ్యాంగ శక్తి" పథకంతో దివ్యాంగులకు లబ్ధి: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి18:**–దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న " దివ్యాంగ శక్తి " పథకం దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుందని , పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనందదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. కర్నూలు కొత్త బస్ స్టాండ్‌లో నిర్వహించిన దివ్యాంగ శక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ప్రారంభించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అందుబాటులో సేవలను మరింత విస్తరించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్ ద్వారా జిల్లాలోని 30,150 మంది దివ్యాంగులకు ప్రతి నెల రూ.18 కోట్ల 66 లక్షల మొత్తాన్ని నేరుగా వారి ఇంటికే వెళ్లి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ అంగ వైకల్యం ఉన్న వారు అర్హులని, సదరం సర్టిఫికెట్, డిజేబిలిటీ గుర్తింపు కార్డు ఆధారంగా ఈ సౌకర్యం పొందవచ్చని చెప్పారు. అర్హత బట్టి వారి సహాయకులకు 50 శాతం రాయితీ కూడా ఉంటుందని పేర్కొన్నారు. గుర్తింపు కార్డు లేదా పాస్ లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 18 నుండి ఈ ఉచిత ప్రయాణ సదుపాయం అమలులోకి వచ్చినట్లు, డిజిటల్ పాస్‌లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణ సమయంలో తప్పనిసరిగా ఒరిజినల్ పాస్ వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుజిల్లా, టి.డి.పి అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ,బొందుల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింహ,ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, కర్నూల్ డిపో మేనేజర్ సుధారాణి ,ఎడి డిజేబుల్ ఫాతిమా రయీస్ , జాతీయ అంధుల సమాఖ్య అధ్యక్షులు పుష్ప రాజ్ , ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ జేమ్స్, జిల్లా దివ్యాంగులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతో ప్రొద్దుటూరు అభివృద్ధికి కృషి చేస్తా...

**ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా**



**ప్రొద్దుటూరు మార్చి 18 మన జనప్రగతి న్యూస్:** ప్రొద్దుటూరు ప్రజల ఆశీర్వాదంతో భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రొద్దుటూరు అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, 13వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష స్పష్టం చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పాలక మండలి పదవీకాలం ముగిసిన సందర్భంగా ప్రజలకు తన ద్వారా చేసిన సేవలు, అనుభవాలు ప్రజలతో పంచుకునేందుకే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం 13వ వార్డు నుంచే ప్రారంభమైందని, 2021 స్థానిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కొన్ని కారణాల వల్ల ఆ పార్టీకి దూరమై కొంతకాలం న్యూట్రల్‌గా ఉన్నానని పేర్కొన్నారు. తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరానని, తన సేవా కార్యక్రమాలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిలారెడ్డి తనను ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా నియమించినట్లు తెలిపారు.

## కడప నారాయణ పాఠశాలలో రంజాన్ వేడుకలలో పాల్గొన్న జిఎం వేమిరెడ్డి




**కడప మన జనప్రగతి మార్చి 18:**–కడప లోని రాజారెడ్డి వీధిలో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం ముందస్తు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పాల్గొని ముస్లిం విద్యార్థులతో కలిసి దువా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ త్యాగానికి ప్రతికని, ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు దయా, కరుణ, ప్రేమ చూపుతూ కఠిన ఉపవాసాలు ఉండడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు

## సంకరజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం




**గాలివీడు మన జనప్రగతి మార్చి 18:**–ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ మరియు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాడు అనగా గాలివీడు మండలం, అరవీడు పంచాయతీ, నడింపల్లి గ్రామం నందు సంకరజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమం నందు 42 దూడలు శిబిరమునకు వచ్చి చేరాయి. ఈ శిబిరం నందు ఆరోగ్యంగా పుష్టిగా ఉన్న మూడు దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు, అలాగే పాల్గొన్న ప్రతి దూడకు పాలక్యాను బహుమతితో పాటు మినరల్ బ్లాక్ మరియు లివర్ టానీకు పంపిణీ చేయడమైనది. అలాగే 95 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వెయ్యడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉపసంచారకులు, డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో అమలు అవుతున్న పథకాల గురించి వివరించారు. అలాగే పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజా తిమ్మారెడ్డి మాట్లాడుతూ లేగ దూడల పోషణ, యాజమాన్య పద్ధతుల గురించి మరియు లింగ నిర్ధారిత వీర్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాయచోటి సహాయ సంచారకులు డాక్టర్ శివారెడ్డి, స్థానిక పశు వైద్యులు డాక్టర్ కె నాగరాజు, మండల అనిమల్ హస్బండ్రీ అసిస్టెంట్లు మరియు గోపాల్ మిత్ర తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా ప్రజలకు ఉగాది,రంజాన్ పండుగ శుభాకాంక్షలు: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప మన జనప్రగతి మార్చి 18:**– శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్య సౌభాగ్యాలను నింపాలని కోరుకుంటూ.. అలాగే పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని...జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలందరికీ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడులు ఉగాది మరియు రంజాన్ పండుగ శుభాకాంక్షలు జిల్లా ప్రజలకు తెలియజేశారు.వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉందని.. పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరు రుచుల కలయికగా ఉగాది పచ్చడిని రూపొందిస్తామని, వైద్య పరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుందన్నారు. ఈ శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరంలో ప్రకృతి అన్నివిధాలా కరుణించి.. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండాలన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని వారు అభిలషించారు. ఆధ్యాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఃఖాల మిశ్రమం అని చెప్పడమే ఉద్దేశ్యంగా ఉగాది జోష్యం చెబుతోందన్నారు. జీవన గమనం శుభాశుభాల మిశ్రమం అని గ్రహిస్తూనే, రాబోయే రోజులకి సిద్ధపడాలని సూచించే సంప్రదాయమే మన "పంచాంగం" అన్నారు. అందుకే సంవత్సరపు మొదటి రోజైన ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పక ఆచరించడం మన ఆనవాయితీ అని గుర్తు చేశారు.పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపు పర్వదినమైన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వ సుపరిపాలన, బాధ్యత, నిబద్ధత, సంక్షేమ పథకాల ఫలాలతో.. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రతిరోజు పండుగలా... సంతోషాల సౌరభాలు వెల్లివిరుస్తున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తస్థాయిలో అందడంతో.. ప్రతీ ఇంటా పండుగ శోభ సంతరించుకుంది. ఈ రంజాన్ పండుగ సందర్భంగా.. అందరికీ అల్లాహ్ ఆశీస్సులు, దీవెనలు అందాలని ఆకాంక్షించారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలి

● 167- తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎన్.మౌర్య

**తిరుపతి మన జనప్రగతి మార్చి 18:**–నియోజకవర్గ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 2026 ప్రక్రియకు గాను అన్నీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూతు లెవెల్ ఎజెంట్లను నియమించి సదరు జాబితా ను ఆఫీసుకు ఈ వారం లోపు సమర్పించాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. 2025 జాబితాలోని ఓటర్లను 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ చేయు నిమిత్తం అందరూ బూత్ లెవెల్ అధికారులు, సూపెర్వైజర్స్, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి మ్యాపింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉగాది పండుగ శుభాకాంక్షలు

● జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్




**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:–** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉగాది కొత్త సంవత్సరానికి నాంది పలికే పవిత్ర పర్వదినమని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ కొత్త ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో జీవిస్తూ సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని అన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉగాది పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని రాజేందర్ పటేల్ గౌడ్ మనసారా ఆకాంక్షించారు.

## నారాయణ విద్యార్థులతో కలిసి ఉగాది వేడుకలలో పాల్గొన్న జిఎం వేమిరెడ్డి



**కడప మన జనప్రగతి మార్చి 18:–** విజయ దుర్గ టెంపుల్ సమీపంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉపాధ్యాయులకు సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను పండుగల యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు జిఎం కి ఉగాది పచ్చడి అందించి పరాభవనామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరి కుటుంబంలో ఆనందం నింపాలని విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అందిపుచ్చుకోవాలని జిఎం ఆకాంక్షించారు.

## గాలికుంట వ్యాధి టీకాలు



**దేవనకొండ మన జనప్రగతి మార్చి 18 :–**దేవనకొండ మండలంలో మార్చి నెల 16వ తారీకు నుండి ఏప్రిల్ నెల 29వ తారీకు వరకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ టీకాల కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు మండలంలో మాచాపురం దేవనకొండ భైరవాణి కుంట నల్లచరిమిల మరియు గుండ్లకొండ గ్రామాలలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగినది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ వెంకటేష్ డాక్టర్ అనిలా మరియు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## దివ్యాంగులకు ఉచిత బస్సు



**దేవనకొండ మన జనప్రగతి మార్చి 18 :–**దేవనకొండ మండలకేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "దివ్యాంగా శక్తీ " వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సహాయకులకు బస్సుఛార్జిలో 50%మినహాయింపు కల్పించిన కార్యక్రమాన్ని ప్రారంభించిన దేవనకొండ మాజీఎంపీపీ కప్పట్రాళ్ళ రామచంద్ర నాయుడు.టీడీపీ నాయకులు విజయభాస్కర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఉచిరప్ప, సొసైటీ చైర్మన్ రాజశేఖర్ గౌడ్, కాకర్ల శాంతికుమార్, ఆకుల వీరేష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని

# కోరుతూ ఏపియంపిఏ వినతి



**జగ్గయ్యపేట మన జనప్రగతి మార్చి 18:–** జగ్గయ్యపేట పట్టణంలో జయప్రద ఫౌండేషన్ వారు జర్నలిస్టు కుటుంబాలకు నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తాతయ్య),కె డిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం,మాజీ యం.యల్.సి తొండపు దశరథ జనార్ధన్,పి4 చైర్మన్ పి కుటుంబరావు గార్లను సన్మానించి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఏపియంపిఏ జగ్గయ్యపేట అధ్యక్షులు కాకరపర్తి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులందరికి నిబంధనలను సడలించి అక్రెడిటేషన్ ఇవ్వాలి.జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రాంతంలో పాత్రికేయులందరికి సుమారు 3 నెలలో ఉచితంగా ఇండ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించి,గృహ నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక చేయూతని అందించాలి.పాత్రికేయుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.సంక్షేమ నిధికి 50 కోట్లు కేటాయించాలి.సీనియర్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో అమలులో ఉన్న విధంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలి.పాత్రికేయులకు ఉచిత రైల్వే పాస్ లను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోండి.పాత్రికేయులు ప్రయాణించే కారుకు ఉచిత టోల్ గేట్ సౌకర్యాని కల్పించాలి.జగ్గయ్యపేట నుండి విజయవాడ వైపు గల ఉన్న రెండు టోల్ గేట్ కి పాత్రికేయుల కార్లకు ఉచిత టోల్ గేట్ ని తమరి సిఫార్సు తో కల్పించాలి.పాత్రికేయుల విధి నిర్వహణలో భాగంగా కావాల్సిన కెమెరాలకు,సెల్ ఫోన్ లకు,ఆడియో,వీడియో కి సంబంధించిన వస్తుల కొనుగోలు కోసం ప్రభుత్వ సబ్సిడీ తో అందించాలి.మా సంస్థ కి సంబంధించిన జగ్గయ్యపేట కమిటీ కి ప్రభుత్వం ఉచితంగా స్థలాన్ని కేటాయించాలని తమరిని కోరుతున్నాము.జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల మండలాలు వారీగా గల ప్రెస్ క్లబ్ అనేది ఆయా మండలాలలో గల పాత్రికేయులందరిది కాదని తమరు గమనించగలరు.జగ్గయ్యపేట నియోజకవర్గంలో గల మండలాలలో గల ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద,చిన్న అని తేడా చూపించకుండా ప్రెస్ కవర్ కోసం పాత్రికేయులందరిని ఆహ్వానించేలా,సీరియల్ ప్రకారం అడ్వర్టైజ్మెంట్ ఇప్పించేలా చూడాలని తమరిని కోరుతున్నాము.మండల కేంద్రాలలో పాత్రికేయుల నైపుణ్యాని పెంచడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రెస్ అకాడమీ ద్వారా ఉచితంగా శిక్షణ అందించాలని కోరుతున్నాము.పి4 లో భాగంగా జర్నలిస్టు లకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపియంపిఏ) జగ్గయ్యపేట నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు కాకరపర్తి రమేష్,కార్యదర్శి గడ్డం రాంబాబు,జిల్లా కార్యదర్శి కళ్యాణపు సూర్యప్రకాశరావు,జిల్లా కమిటీ సభ్యులు మెటికల శ్రీనివాసరావు,కమిటీ బేతు రంగా,మాల్యాద్రి(వంశీ),బి యశ్వంత్,కరిసే మధు,బాణావత్తు సురేష్,తాళ్ళూరి దుర్గారావు,బొందిలి అమర్ సింగ్,పుష్పా,కాకరపర్తి సోమేశ్వరావు,యంద్రాతి రాకేష్,గోళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చింతపర్తి విద్యార్థిని గెడి నిహారిక నవోదయ పరీక్షలో ప్రతిభ

### గ్రామీణ ప్రతిభకు గౌరవం: నవోదయలో 182వ ర్యాంక్ సాధించిన నిహారిక



**వాల్మీకిపురం, మన జనప్రగతి మార్చి 18:–** చింతపర్తి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల కు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని గెడి నిహారిక జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచింది. గత ఏడాది డిసెంబర్ 13న (13/12/2025) జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలలో, వాల్మీకిపురం మండలం నుండి అత్యుత్తమ మార్కులతో ర్యాంకు 182 సాధించి ఉత్తీర్ణురాలై నవోదయ సీటుకు అర్హత సాధించింది.నిహారిక సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజ మాస్టర్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించవచ్చని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా గెడి నిహారికను, ఆమె తల్లిదండ్రులు గెడి చిరంజీవి మరియు సుజాతలను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.నిహారికను అభినందించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వనజ, శశికళ, యల్లప్ప, అనురాధ, మల్లికార్జున ఉన్నారు. అలాగే విద్యార్థినికి ప్రత్యేక శిక్షణ అందించిన ట్యూషన్ మాస్టర్ డి.నాగరాజ, మదనపల్లిలోని మల్లికార్జున నవోదయ కోచింగ్ సెంటర్ కరెస్పాండంట్ ఆరమడక మల్లికార్జున మరియు తల్లిదండ్రులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కలలు నిజం కావాలంటే నిరంతరం శ్రమించాలి

● ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సదస్సులో వక్తలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:–** విద్యార్థినులు తమ కలలను నిజం చేసుకోవాలంటే విశ్రమించకుండా పట్టుదలతో శ్రమించాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మై డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పాజిటివ్ థింకింగ్ మరియు వేదిక్ మాథ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.



కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు.వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థినిలకు సరైన మోటివేషన్,కెరీర్ గైడెన్స్ ఎంతో అవసరమని పేర్కొన్నారు.డాక్టర్ వి.భవ్య చరిత ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థిని తనను తాను గౌరవించుకోవాలని, సానుకూల ఆలోచనా దృక్పథం (సానుకూల ఆలోచన) మరియు ఆత్మవిశ్వాసంతోనే భవిష్యత్తును ప్రకాశవంతం చేసుకోవచ్చని వివరించారు.డి.చిన్నయ్య మాట్లాడుతూ, విజయం సాధించాలంటే సమయపాలన,దృఢ సంకల్పం,ఓపిక,నిజాయితీ మరియు సరైన ప్రణాళిక కలిగి ఉండాలని సూచించారు.జె.బాలశివ వేదిక్ మాథ్స్ గురించి వివరిస్తూ, గణితంలోని మెళకువలను జీవితంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి ఎలా అన్వయించుకోవాలో విద్యార్థినిలకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినిలు పాల్గొన్నారు.

# విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోండి

● బీసీ సంక్షేమ శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశం



**అమరావతి మన జనప్రగతి మార్చి 18:–** బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, పరీక్ష ఒత్తిడిలో ఉండే వారికి వెన్నుదన్నుగా ఉంటూ భరోసా ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖాధికారులను, హాస్టళ్ల సిబ్బందిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. పరీక్ష సరిగ్గా రాయలేకపోయానన్న ఆవేదనతో టెన్త్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. ఆ సమయంలో ఆ విద్యార్థికి వెన్నుతట్టే వారు ఉంటే, ఇంతటి ఘోరం జరిగేది కాదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు పరీక్ష సరిగ్గా రాయలేకపోయానే ఆవేదనతో గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ కు చెందిన టెన్త్ విద్యార్థి రాకేశ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోవడంపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంపై విచారం వ్యక్తంచేశారు. తక్షణమే ఘటనకు సంబంధించి నివేదిక ఇవ్వాలని గుంటూరు డీబీసీడబ్ల్యూవోను ఆదేశించారు. విద్యార్థి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబానికి సానుభూతి వ్యక్తంచేశారు. హాస్టల్ లో మిగిలిన విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా చూడాలని డీబీసీడబ్ల్యూవోను, వార్డెన్ ను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కదలికలపైనా దృష్టి పెట్టాలని, పరీక్షలకు మానసికంగా సన్నద్ధమయ్యేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని స్పష్టంచేశారు. అనారోగ్య లక్షణాలున్న విద్యార్థులను గుర్తించి తక్షణమే వైద్య సేవలందించాలని, మానసిక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడించాలన్నారు. మార్కులు, ఫలితాలతో పాటు నైతిక విలువలతో కూడిన జీవనమే ప్రధానమని టెన్త్ విద్యార్థులకు మంత్రి సవిత తెలిపారు.. పరీక్షల సందర్భంగా ఎటువంటి ఒత్తిడి గురి కావొద్దని, ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులు, వార్డెన్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేలా కష్టపడాలని, క్షణికావేశంతో ఎటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోరాదని మంత్రి సవిత సూచించారు. హాస్టళ్లు, ఎంపేజీ స్కూళ్ల విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఆ ప్రకటనలో బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు.

# 11వ రోజు నారాయణ నేత్ర జ్యోతి , దంత సురక్ష ఉచిత వైద్య శిబిరం




**నెల్లూరు మన జనప్రగతి మార్చి 18:–** రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దిశానిర్దేశంతో ప్రారంభమైన ఉచిత వైద్య శిభిరం 11 వ రోజుకు చేరుకొంది .సిటీ నియోజకవర్గంలో పేదలు నివాసం ఉండే ప్రదేశాల్లో రోజుకోచోట వైద్యశిబిరాన్ని నారాయణ వైద్యకళాశాల నిర్వహిస్తోంది .అందులో భాగంగా బుధవారం 40వ డివిజన్ మూలాపేటలోని కొండదిబ్బ ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'నారాయణ నేత్ర జ్యోతి' మరియు దంత సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది .వైద్య శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు .గడచిన 10 రోజుల్లోనే 1,100 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి, సుమారు 586 మందికి ఉచితంగా కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు వైద్యులు నిర్ధారించారన్నారు. శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన 39 మందిని నారాయణ వైద్యకళాశాల సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్లు పూర్తి చేసి, తిరిగి సురక్షితంగా ఇంటి వద్ద దించి మందులను కూడా అందజేస్తారన్నారు. పేదవారి ఇళ్ళలో వెలుగులు నింపడమే ధ్యేయంగా సాగుతున్న ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ లో పేదలు నివసించే ప్రతీ ప్రాంతానికి చేర్చాలన్నది మంత్రి నారాయణ సార్ సంకల్పమన్నారు .ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యకళాశాల కంటివైద్య నిపుణులు డాక్టర్ ఉమా ,డాక్టర్ జ్యోస్న,దంత వైద్య నిపుణులు డాక్టర్ మనోజ్ ,డాక్టర్ దివ్య ,డాక్టర్ లోహిత ,40వ డివిజన్ అధ్యక్షుడు గండవరపు నాని, వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి రాజేశ్వరి, యూనిటీ ఇంచార్జి మురళి, కో క్లస్టర్ ఇంచార్జ్ సుమంత్ కుమార్ స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన కూటమి నాయకులు

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:–**పులివెందుల నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి నాయకులు దివ్యాంగ శక్తి పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి,తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మరియు వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు, దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ పులివెందుల గడ్డపై ప్రతి ఒక్క దివ్యాంగుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని,వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.అజ్జుగుట్టు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, స్వయం ఉపాధి కోసం ప్రత్యేక నైపుణ్య శిక్షణ కూడా అందిస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేయడంతో పాటు,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్,ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కూటమి నాయకులు తూగుట్ల మధుసూదన్ రెడ్డి, నల్లాగారి భాస్కర్ రెడ్డి, పులివెందుల మండల వైస్ ఎంపీపీ విశ్వనాథ రెడ్డి,రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష గారు,పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్,ఓబుల్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 -03-2026

# నవోదయలో ఎస్వీ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థుల సత్తా.. నలుగురికి ఎంపిక



**పీలేరు, మన జనప్రగతి మార్చి 18:-**పీలేరు పట్టణంలోని ఎస్.వి. నవోదయ కోచింగ్ సెంటర్ మరోసారి విజయకేతనం ఎగురవేసింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ఈ సంస్థకు చెందిన నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణులై ప్రతిభ చాటుకున్నారు. గత డిసెంబర్ 13న నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఈ విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచింది.ఎంపికైన విద్యార్థుల్లో బి.దుష్యంత్ చౌదరి (హాల్ టికెట్ నెం: 1007607), బి.ఉన్నతి (హాల్ టికెట్ నెం: 1023574), ఎం.జస్వంత్ (హాల్ టికెట్ నెం: 1007423), ఎం.శేతు ప్రణవి (హాల్ టికెట్ నెం: 1007608) ఉన్నారు. వీరి విజయంతో కోచింగ్ సెంటర్ ఖ్యాతి మరింత పెరిగింది.ఈ సందర్భంగా ఎస్.వి. నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కె.మనోరంజిత నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసి ఈ విజయానికి కారణమని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, సమగ్ర ప్రణాళికతో బోధన అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.అదేవిధంగా, ఎంపికైన ఈ విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆమె వెల్లడించారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్లేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.స్థానికంగా ఈ విజయంపై ఆనందం వ్యక్తమవుతుండగా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట వేయాలి: లోక్‌సభలో వై.ఎస్.అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:-** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి పార్లమెంట్ వేదికగా డిమాండ్ చేశారు.బుధవారం లోక్‌సభలో వ్యవసాయం మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధించిన గ్రాంట్లపై జరిగిన చర్చలో ఎంపీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతాంగం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.2019 నుండి పీఎం కిసాన్ పథకం కింద అందుతున్న రూ. 6,000 లబ్ధి మారలేదని,పెరిగిన సాగు ఖర్చుల దృష్ట్యా దీనిని రూ. 10,000 కు పెంచాలని కోరారు.వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో (2019-24) ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన ఉచిత పంటల బీమా వల్ల 54 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్ల ప్రయోజనం చేకూరిందని గుర్తుచేశారు.ప్రస్తుత ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో రాష్ట్రం బ్లాక్ లిస్టులోకి వెళ్ళడం దురదృష్టకరమన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అరటి,మామిడి,కర్బూజ వంటి ఉద్యానవన పంటల ఎగుమతులు నిలిచిపోయాయని,దీనివల్ల రాయలసీమ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రం జోక్యం చేసుకుని రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని కోరారు.రాయలసీమ ప్రాంతం హార్టికల్చర్ హబ్ అని,ఇక్కడ పండే పంటలకు అదనపు విలువ చేకూరాలంటే మరిన్ని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి గ్రామంలో అగ్రికల్చర్ వేర్‌హౌస్‌లు,ప్రతి మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు నిర్మించాలని,అలాగే వ్యవసాయ యాంత్రీకరణకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ బకాయిలు కూడా వెంటనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఎంపీ అవినాష్ రెడ్డి కేంద్రానికి విన్నవించారు.

# మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఉత్సాహంగా ఇఫ్తార్ విందు



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 18:**రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి చెప్పారు. రంజాన్ నేపథ్యంలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఇందులో ముస్లిములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేంపల్లెలోని విశ్వనాథ్ మిషన్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలతో కలిసి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు ముస్లిం నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.మసీదులు మరమ్మతులు, ఇమాము మౌజన్ లకు నిధులు ఇస్తుందన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో ముస్లిములతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాష, ఎంహెచ్ పిఎస్ పులివెందుల అధ్యక్షుడు మహబూబ్ బాషా, వేంపల్లి ఎంహెచ్ పిఎస్ అధ్యక్షుడు దర్బార్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, జబిబుల్లా, బాలకృష్ణారెడ్డి, ఎంఆర్ టి కరీముల్లా, యాసిన్, గంగధర్ రెడ్డి, వేమా కుమార్, వీరబద్ర, తక్కెల షరీఫ్ లతో పాటు పలువురు టిడిపి నేతలు, ముస్లిం మైనారిటీలు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరులో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం



**రైల్వేకోడూరు మన జనప్రగతి మార్చి 18 :-**తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో దివ్యాంగుల సాధికారతకు తోడ్పడే దివ్యాంగ శక్తి పథకం ఘనంగా ప్రారంభమైంది. టిడిపి యువ నాయకుడు ముక్క సాయి వికాస్ రెడ్డి చేతుల మీదుగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. స్త్రీ శక్తి పథకం తరహాలోనే దివ్యాంగులకు ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులను బస్సులో ఎక్కించి ముక్కవారి పల్లికి ప్రత్యేక ప్రయాణాన్ని నిర్వహించారు.ముక్కవారి పల్లెలో దివ్యాంగులకు భోజన వసతిని ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేకంగా సేవలు అందించారు. పూజలు, హారతులతో బస్సుకు శుభారంభం చేసి, రిబన్ కట్ చేసి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్, కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముక్కా వరలక్ష్మమ్మ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ శక్తి పథకం అమలు వేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఉచిత రవాణా, వైద్య శిబిరాలు, సహాయక ఉపకరణాల పంపిణీతో పాటు దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు.అలాగే సమాజంలో దివ్యాంగులపై అవగాహన పెంపొందించడం ముఖ్యమని, ఇది నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమాల్లో భాగమని వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు మరింత సహాయం అందడంతో పాటు, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# సమస్యను గుర్తించడమే వ్యాపారానికి మూలం

● యానిమాలియా బయోజెనిసిస్ కో ఫౌండర్ , సైకాలజిస్ట్ ఇషా సేన్



**కడప, మన జనప్రగతి, మార్చి,18,:-** ప్రజల సమస్యలను అవసరాలను గుర్తించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చే ఏ వ్యాపారమైన సుస్థిరంగా నిలుస్తుందని బెంగళూరు యానిమాలియా బయోజెనిసిస్ కో ఫౌండర్ ,సృజనాత్మక వ్యూహకర్త , నాణ్యత, శిక్షణ అధిపతి, సైకాలజిస్ట్ ఇషా సేన్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని మేనేజ్మెంట్ విద్యార్థులకు " వ్యాపార రంగంలో నూతన ఆలోచనలు -సుస్థిరత " అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ను బుధవారం వైవియూలోని ఆర్ట్స్ బ్లాక్ లో నిర్వహించారు. ఇషా సేన్ మాట్లాడుతూ వ్యాపారానికి ఆలోచన ముఖ్యమన్నారు. ఆలోచనలను క్రమ పద్ధతిలో కార్యచరణలోకి తీసుకురావాలన్నారు. వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలనే దానిపై ఆమె సరి కొత్త ఆలోచనలు ఇచ్చారు. వ్యాపారానికి మూలం సమస్యను గుర్తించడం. గుర్తించిన సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడమేనన్నారు. కొత్త మార్గం అధ్యయనం చేసి విశ్లేషించుకొని ముందుకు కదలాలన్నాలరు. విద్యార్థులకు సందేహ నివృత్తి చేశారు. ఎంబీఏ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి సరిత కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్ , డీన్ ఆచార్య వై సుబ్బరాయుడు, సహా ఆచార్యులు డాక్టర్ ఎస్ వి సుబ్బారెడ్డి, డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి, వర ప్రభాకర్ డాక్టర్ గంగయ్య, అధ్యాపకులు అనిల్ దేవకుమార్, పి సుధీర్ కుమార్ , పి రాజశేఖర్, వి వెంకట రమణయ్య, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్‌కు వచ్చిన ఇక్కట్లు

● బుక్ చేసినప్పటికీ అందుబాటులో లేక గోడౌన్ వైపు ప్రజల పరుగులు

● గంటల తరబడి క్యూలైన్‌లో ప్రజలు




**గాలివీడు మన జనప్రగతి మార్చి 18:-** మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా మారింది. వంట గ్యాస్ సిలిండర్ల కోసం మహిళలు, వృద్ధులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉదయం నుండే పెద్ద ఎత్తున బారులు తీరుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ప్రపంచ స్థాయిలో జరుగుతున్న అమెరికా, ఇజ్రాయిల్, మరియు ఇరాన్, యుద్ధ ప్రభావంతో సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో గ్యాస్ కొరత ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పరిస్థితిని ముందుగా అంచనా వేసి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు.ప్రత్యేకించి పేద, బడుగు, బలహీన వర్గాలకు ఈ కొరత మరింత ఇబ్బందిగా మారింది. గ్యాస్ లేకపోవడంతో కొందరు మళ్లీ కట్టెలు పొయ్యిలు, చెరకు మిగులు వంటివి ఉపయోగిస్తూ వంట చేయాల్సి వస్తోంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని మహిళలు చెబుతున్నారు.ఇక గ్యాస్ సరఫరా ఎప్పుడు సాధారణ స్థితికి వస్తుందో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సరిపడా గ్యాస్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకురావాలని, క్యూలైన్ ఇబ్బందులు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నేడు పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు

సాంప్రదాయ దుస్తుల్లో ఉగాది ఉత్సవాలకు తరలిరండి

కూటమి శ్రేణులకు బీటెక్ రవి పిలుపు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:-** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని, గురువారం ఉదయం 9:00 గంటలకు పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉగాది మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరగనుంది. పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలో భాగంగా ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ పంచాంగం రామ్ కుమార్ శర్మ భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కార్యక్రమానికి విచ్చేసే కూటమి నాయకులు,కార్యకర్తలు అందరూ తప్పనిసరిగా సాంప్రదాయ పంచె కట్టు ధరించి రావాలని బీటెక్ రవి కోరారు. పులివెందుల నియోజకవర్గంలోని కూటమి శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఉగాది మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.


# తెలుగు లోగిళ్లలో సకల శుభాలు కలగాలి

● ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:-** తెలుగు నూతన సంవత్సరాది 'శ్రీ పరాభవ' నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మరియు నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ పర్వదినం ప్రతి ఇంటిలో సకల శుభాలను,సుఖసంతోషాలను చేకూర్చాలని ఆయన ఆకాంక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ముఖంగా తెలియజేస్తూ ప్రజలందరూ ఉగాది పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరి జీవితంలో ఈ నూతన సంవత్సరం కొత్త ఆరంభాలకు నాంది పలకాలని, అందరూ ఆయురారోగ్యాలతో,విజయాలతో వర్ధిల్లా లని ఆశించారు.ప్రజా ప్రతినిధులకు,అధికారులకు, శ్రేయోభిలా షులకు మరియు తన ఆత్మీయులకు ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి ప్రత్యేకంగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

# జాన మద్ది విజయభాస్కర్‌కు ఉగాది పురస్కారం



**కడప, మన జనప్రగతి మార్చి 18:-**వైయస్సార్ కడప జిల్లా కడప సి పి బ్రౌన్ పరిశోధక గ్రంథాలయం సభ్యుడు. జానమద్ది సాహితీ పీఠం ట్రస్ట్. జాన మద్ది విజయభాస్కర్ కు సాహిత్యం. సంస్కృతి విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ఎంపిక చేశారు. ఈ మేరకు సాహిత్యం సంస్కృతి. సృజనాత్మకత. సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉగాది పండుగ పర్వదినం పురస్కరించుకొని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి. నారా చంద్రబాబు నాయుడు చేతులు వేరుగా ఉగాది పురస్కారం అనుకోనన్నారు. జానమద్ది విజయ భాస్కర్ కు ఉగాది పురస్కారం లభించడం పట్ల జిల్లాలోని కవులు. రచయితలు. చరిత్రకారులు. సాహితీ వేత్తలు. కడప సిపి బ్రౌన్ పరిశోధన గ్రంథాలయం సభ్యులు అధికారులు ఉద్యోగులు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# వృషబాచలేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది ఆస్థానం

**వేంపల్లె మన జనప్రగతి మార్చి 18:** స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఉగాది ఆస్థానం కార్యక్రమం చేపట్టుతున్నట్లు దేవస్థానం ఇఓ కడప సుభాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వృషబాచలేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవస్థానంమైన మైయిన్ బజార్ లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఆస్థానం కార్యక్రమం చేపట్టుతున్నట్లు చెప్పారు. అలాగే ఆరాధన కార్యక్రమంతో పాటు పంచాంగ శ్రవణం చదవడం జరుగుతుందని చెప్పారు. గ్రామోత్సవం కూడ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 -03-2026

## పరాభవ నామ సంవత్సరంలో ప్రతి ఇంటా శుభాలు కలగాలి

**● జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ అవినాష్ రెడ్డి**



**పులివెందుల మన జనప్రగతి మార్చి 18:-** తెలుగువారి తొలి పండుగ ఉగాది అని సరికొత్త ఆశలకు ఆశయాలకు ప్రతీక,చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈ పండుగతో వసంత రుతువు ప్రారంభమవుతుందని చెట్లు చిగురించి,ప్రకృతి అందాలను సంత రించు కుంటుందని,ఉగాది పండుగ పరాభవ నామ సంవత్సర ప్రతి ఇంట సకల శుభాలు చేకూరాలని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉగాది మీ జీవితంలో సరికొత్త ఆశలను చిగురిం పజేయాలని,ఆనందమయంగా ఉండాలని,పరాభవ నామ సంవత్సరం మీ కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు నింపాలని,ఉగాది పచ్చడిలో బాధలనే చేదు తగ్గి,సం తోషమనే తీపి పెరగాలని ఆశిస్తూ మనస్ఫూర్తిగా ప్రతి కార్య కర్తకు నాయకులకు అభిమానులకు శ్రేయోభిలాషులకు ప్రజాల ప్రతినిధులకుఅధికారులకుఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి**



**సిద్దవటం మన జనప్రగతి మార్చి 18:-** పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా మండల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పి. కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి సూచిం చారు. బుధవారం ఉక్కాయపల్లె గ్రామంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.వడదెబ్బ తగలకుండా కొబ్బరి బోండాలు, శీతల పానీయాలు, నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. 60 ఏళ్లు పైబడిన వారు, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎండల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎం డలో బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు వాడాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

## పార్వతీపురం పాఠశాలలో వైభవంగా ముందస్తు ఉగాది వేడుకలు



**సిద్దవటం మన జనప్రగతి మార్చి 18:-** మండలంలోని మాధవరం-1 పంచాయతీ, పార్వతీపురం గ్రామంలోని ఎస్.పి.బి.వి.డి. సభ హైస్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ మరియు హెడ్మాస్టర్ ఎం.డి. మధుసూదన ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. విద్యార్థులు గణపతి, సరస్వతి పూజలు నిర్వహించి, ఉగాది పచ్చడిని స్వయంగా తయారు చేశారు. ఉగాది షడ్రుచుల ప్రాముఖ్యతను వివరిస్తూ, జనవరి 1 కాదని, ఉగాది పండుగే మన తెలుగు నూతన సంవత్సరమని చాటిచెప్పారు. అనంతరం అందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**- స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు**

**సిద్ధవటం మన జనప్రగతి మార్చి 28:-** రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆదేశాల మేరకు, బుధవారం సిద్ధవటం మండలం మాధవరం-1 మరియు ఎస్.కే.ఆర్ నగర్‌లో "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న 'అన్నదాత సుఖీభవ' నిధులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్న ఆయన, ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల వివరాలను ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందనే విషయాన్ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెగడ హరి ప్రసాద్, మావిళ్ళ మురళి, కరమళ్ళ భాషా, సుబ్బరామయ్య, జానపాటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది రంజాన్ సందేశంతో ఐక్యతకు నాంది

**● ప్రజల అభివృద్ధే మా లక్ష్యం : టీడీపీ యువ నాయకుడు బాబ్జాన్**



**గుర్రంకొండ, మన జనప్రగతి మార్చి 18:** గుర్రంకొండ మండల ప్రజలకు మరియు సమస్త తెలుగు ప్రజలకు ఉగాది మరియు రంజాన్ పర్వదినాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ గుర్రంకొండ టీడీపీ యువ నాయకుడు బాబ్జాన్ పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా కొత్త ఆశలు, ఆశయాలకు నాంది పలుకుతుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం నిండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త విజయాలు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అలాగే పవిత్రమైన రంజాన్ మాసం అనంతరం జరుపుకునే ఈద్ పర్వదినం సోదరభావం, శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ , పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి , అలాగే జనసేన అధినేత మరియు ముఖ్య నాయకుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుం దని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఉగాది & రంజాన్ శుభాకాంక్షలు" అని గుర్రంకొండ టీడీపీ యువ నాయకుడు బాబ్జాన్ తెలిపారు.

## నకిలీ పత్రాలతో నా భూమిని ఆక్రమించే కుట్ర చేస్తున్నారు: గంజికుంట సుబ్బరాజేశ్వర రావు



**పోరుమామిళ్ల కాశినాయన, మన జనప్రగతి, మార్చి 18:-** కాశి నాయన మండలం, ఇటుకలపాడు గ్రామ సర్వే నెంబర్ 458 లోని 18.40 భూమి తీవ్ర వివాదానికి, ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. అదే గ్రామానికి చెందిన మాజీ అర్మీ కమాండర్ గంజికుంట సుబ్బరాజేశ్వర్ రావు బుధవారం పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ భవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మైదుకూరు ప్రాంతానికి చెందిన ఆకుల ఓబులేసు, సావిశెట్టిపల్లి గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు పోలయ్య, ఇటుకలపాడు గ్రామానికే చెందిన ఆదినారాయణ రెడ్డి ఇంకా ఏడు మంది నా భూమిని ఆక్రమించే ప్రయత్నంలో నాపై దౌర్జన్యం చేస్తున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని బాధను, ఆవేదనను వ్యక్తం చేశారు. ఆర్మీ నుంచి రిటైర్డ్ కాగా వచ్చిన డబ్బుతో ఎనుముల రాములు అనే ఆమె వద్ద చట్టబద్ధంగా కొన్నానని, 2019 నుంచి ఈభూమి నా అధీనంలో ఉందని అన్నారు. ఈ భూమి కొన్నప్పటి నుంచి నాకు నాకు కష్టాలు మొదలయ్యాయని, దౌర్జన్యాలు, బెదిరింపులు ఎక్కువయ్యాయని వాపోతున్నారు. మైదుకూరు ప్రాంతానికి చెందిన ఆకుల ఓబులేసు, సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు ఓబులేసు, ఇటుకుల పాడు గ్రామానికి చెందిన ఆదినారాయణ రెడ్డి, మరో ఏడు మంది నకిలీ పత్రాలు సృష్టించి నా భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, రకరకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని బాధను వ్యక్తం చేశారు. వీళ్ళ దౌర్జన్యాలు భరాయించలేక పోలీస్ కంప్లైంట్ ఇవ్వడము, కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకోవడం కూడా జరిగింది అన్నారు. ఆ భూమి నాదే అయినందున అన్ని డాక్యుమెంట్స్ నా పేరు మీదే ఉన్నందున కోర్టు కూడా నాకు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని అన్నారు. వచ్చిన తాసిల్దార్లు అందరూ కూడా ఆ భూమితో మీకు సంబంధం లేదు, మీవి ఫేక్ డాక్యుమెంట్స్ అని చెప్పినప్పటికీ కూడా వినకుండా ఇప్పటికీ నన్ను వేధిస్తున్నారు, బెదిరిస్తున్నారు అన్నారు. లంచాలు తీసుకొని రెవెన్యూ అధికారులు, పోలీసులు నాకు సహకరిస్తున్నారని చివరకు వారిని కూడా ఈ పదిమంది బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ పేరు చెప్పుకొని, సిపిఎం పార్టీ పేరు చెప్పుకొని విచ్చలవిడిగా చెలరేగిపోతూ చాలామందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీరి దౌర్జన్యాలకు అడ్డే లేకుండా పోతోందని, చర్యలు తీసుకోవాలని పోలీసులను ప్రభుత్వాన్ని గంజికుంట సుబ్బరాజేశ్వరరావు కోరడం జరిగింది.


## చెన్నూరు తాసిల్దార్‌గా విజయ్ కుమారి బాధ్యతలు

**● ఘనంగా సన్మానించిన కడప కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డి**



**చెన్నూరు, మన జనప్రగతి, మార్చి,18:-**జిల్లా వ్యాప్తంగా తాసిల్దార్లు బదిలీల భాగంగా చెన్నూరు తాసిల్దార్ ను కడప కలెక్టరేట్కు బదిలీ చేశారు. చెన్నూరు తాసిల్దార్ గా కడప కలెక్టరేట్లో సూపర్నెంట్ గా పని చేస్తున్నా విజయ్ కుమార్ కి పదోన్నతి కల్పిస్తూ చెన్నూరు తాసిల్దార్ గా నియమించారు. బుధవారం చెన్నూరు తాసిల్దార్ సరస్వతి రిలీవ్ గాక తాసిల్దారుగా విజయ్ కుమారి పదవి బాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలను స్వీకరించిన విజయ్ కుమారి కార్యాలయంలో ఉన్న పలు ఫైళ్లను పరిశీలించారు . చెన్నూరు తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన కడప కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్. తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి( బుజ్జన్న) ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్. ఇంద్ర రెడ్డి శివారెడ్డి. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు. కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి. సాల్వ్ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమారి మాట్లాడుతూ రైతులు గృహ వినియోగదారులు ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## ముగిసిన న్యావధుల ఎన్నికల నామినేషన్



**పత్తికొండ మన జనప్రగతి మార్చి 18:-** పత్తికొండ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు 17 వ తేదీ నుండి 18 వ తేదీతో గడువు నామినేషన్ల దాఖలు గడువు ముగిసిందని న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారి ప్రసాద్ బాబు తెలిపారు. బుధవారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యక్షుడు పదవికి మూడు (ఒకే అభ్యర్థి వై. శ్రీనివాసరెడ్డి రెండు) వై. మధు బాబు నామినేషన్స్ వేయగా ఉపాధ్యక్ష పదవికి రెండు జే. రవికుమార్, కబీర్దాస్, జనరల్ సెక్రెటరీ కి రెండు ఈ. జగదీష్, పి. లక్ష్మణరావు, ట్రెజరర్ పోస్టుకి రెండు కబీర్దాస్, సరోజా భాయ్, లైబ్రరీ సెక్రటరీకి రెండు నరసారావు, చంద్రశేఖర్, లేడీ రిప్రజెంటివ్గా సాజిదా బేగం నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారిబి ప్రసాద్ బాబు తెలిపారు. 19 తేదీ బుధవారం నామినేషన్ ఉపసంహరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు నెట్టికల్,భాస్కర్ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి ఘనంగా అభిషేకాలు,విశేష పూజలు

**● కోతి సమాధి వద్ద గల అయ్యప్ప ఆలయంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18 :-** పులివెందుల పట్టణంలోని కోతి సమాధి సమీపంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం హరిహరసుతుడు, అన్నదాన ప్రభువు అయ్యప్ప స్వామికి అభిషేకాలు,విశేష పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అయ్యప్ప స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన బుధవారం కావడంతో ఆలయ నిర్వాహకులు,గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుండే స్వామివారికి పంచామృతాభిషేకాలు, మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు భక్తులకు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.సాయంకాల సమయాన అయ్యప్ప నామస్మరణతో భజన కార్యక్రమాలు నిర్వహించి,భక్తులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి బుధవారం ఈ ఆలయంలో విశేష పూజలు,అభిషేకాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన అభ్యర్థించారు.భజనలు మరియు అన్నదాన కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## రంగనాథ స్వామి దేవస్థాన ముఖద్వారానికి సరికొత్త శోభ

**సొంత నిధులతో ముఖద్వార తలుపులకు పాలిష్ చేయిస్తున్న బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి**



**పులివెందుల రూరల్ మన జనప్రగతి మార్చి 18:-**పులివెందుల పట్టణంలోని అత్యంత పురాతనమైన శ్రీ రంగనాథ స్వామి దేవస్థాన ముఖద్వారానికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సరికొత్త హంగులు అద్దుతున్నారు.గత మూడు రోజుల నుండి దేవస్థాన ప్రధాన ముఖద్వార టేకు తలుపులకు పాలిష్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.బుధవారం నాడు టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి ఈ పనులను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2018 వ సంవత్సరంలో దాదాపు 4 లక్షల 30 వేల రూపాయల తన సొంత నిధులతో ఈ భారీ టేకు తలుపులను చేయించడం జరిగిందని గుర్తుచేశారు. తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది పండుగ వస్తుండటంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు, ముఖద్వారం ఆకర్షణీయంగా కనిపించేలా మళ్లీ తన సొంత ఖర్చులతోనే పాలిష్ చేయిస్తున్నట్లు తెలిపారు.ఈ పాలిష్ పనులకు దాదాపు 50 వేల రూపాయల వరకు వ్యయమవుతోందని,పండుగ నాటికి పనులు పూర్తి చేసి ఆలయానికి ఒక ప్రత్యేక శోభను తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.దైవ కార్యాల కోసం తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఆలయ సిబ్బంది మరియు పాలిష్ పనులు చేసే కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా "ఈద్ కానుకల" పంపిణీ



**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 18:-**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గం మజీద్ బండ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం తరపున మైనారిటీ సోదరులకు అందించిన ఈద్ కానుకల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.కాంగ్రెస్ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డివిజన్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జహంగీర్ డివిజన్ సెక్రటరీ ఎండి. అజామ్, ఐవైసీ డివిజన్ ప్రెసిడెంట్ కోడిచర్ల మహేందర్ , ఇమ్రాన్, రిషి రాయ్, లావణ్ కుమార్, నాగరాజ్ మరియు మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వారు తమ చేతుల మీదుగా స్థానిక ముస్లిం సోదరులకు ఈద్ కానుకలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పండుగలను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నదే ప్రభుత్వ ఆశయమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## వేంపల్లె శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 18:-**స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు ఉగాది, రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలవో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారభించారు. ముందస్తు వేడుకల్లో విద్యార్థులు అందరూ సంప్రదాయ పద్ధతిలో దుస్తులను వేసుకొని వచ్చి ఆయా సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థుల్లో భిన్న మతాల పండుగల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, పరస్పర గౌరవం, ఐక్యత భావం మరియు సాంస్కృతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు.ఉగాది పండుగ అనేది తెలుగు వారికి చాలా ముఖ్యం అన్నారు.జీవితంలోని అనుభవాలను ఉగాది పచ్చడి తెలియ జేస్తుందని చెప్పారు. పిల్లలందరూ ఎంతో ఆరోగ్యంగా, సంతోషంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని అలాగే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులు అందరికి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చింతపర్తి విద్యార్థిని గెడి నిహారిక నవోదయ పరీక్షలో ప్రతిభ

## గ్రామీణ ప్రతిభకు గౌరవం: నవోదయలో 182వ ర్యాంక్ సాధించిన నిహారిక




**వాల్మీకిపురం, మన జనప్రగతి మార్చి 18:-** చింతపర్తి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల కు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని గెడి నిహారిక జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచింది. గత ఏడాది డిసెంబర్ 13న (13/12/2025) జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలలో, వాల్మీకిపురం మండలం నుండి అత్యుత్తమ మార్కులతో ర్యాంకు 182 సాధించి ఉత్తీర్ణురాలై నవోదయ సీటుకు అర్హత సాధించింది. నిహారిక సాధించిన ఈ విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజ మాస్టర్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించవచ్చని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా గెడి నిహారికను, ఆమె తల్లిదండ్రులు గెడి చిరంజీవి మరియు సుజాతలను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. నిహారికను అభినందించిన వారిలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వనజ, శశికళ, యల్లప్ప, అనురాధ, మల్లికార్జున ఉన్నారు. అలాగే విద్యార్థినికి ప్రత్యేక శిక్షణ అందించిన ట్యూషన్ మాస్టర్ డి.నాగరాజ, మదనపల్లిలోని మల్లికార్జున నవోదయ కోచింగ్ సెంటర్ కరెస్పాండంట్ ఆరమడక మల్లికార్జున మరియు తల్లిదండ్రులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.


# పులివెందులలో తీరని గ్యాస్ కష్టాలు

### అందినట్లు మెసేజ్ అందని సిలిండర్లు

### డెలివరీ బాయ్స్ ఆగడాలు అదనపు వసూళ్లతో వినియోగదారుల బేజారు

### హోటళ్లకు బ్లాక్ మార్కెట్ సామాన్యుడికి మాత్రం నో స్టాక్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ పంపిణీపై వరుస సమీక్షలు నిర్వహిస్తూ,బుక్ చేసిన రెండు రోజుల్లోనే సిలిండర్ అందించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా పులివెందుల నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా పులివెందుల పట్టణంలో గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన వెంటనే,వారి మొబైల్ ఫోన్లకు సిలిండర్ డెలివరీ అయినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి కానీ వాస్తవానికి సిలిండర్ మాత్రం చేరడం లేదు. దీనిపై గ్యాస్ ఏజెన్సీలను లేదా డెలివరీ బాయ్స్‌ను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. సిలిండర్ ఇంటికి తెచ్చిన డెలివరీ బాయ్స్ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి సిలిండర్ మీద అదనంగా 100 రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ఇవ్వని పక్షంలో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, సిలిండర్లు లేవని సాకులు చెబుతూ వెనుదిరుగుతున్నారు. మరోవైపు,సామాన్యులకు అందాల్సిన సిలిండర్లను డెలివరీ బాయ్స్ గుట్టుచప్పుడు కాకుండా హోటళ్లకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. సామాన్య ప్రజలు గ్యాస్ కోసం కళ్లలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తుంటే,రాజకీయ నాయకులకు,పోలీసులకు మరియు రెవెన్యూ అధికారులకు మాత్రం గ్యాస్ సిలిండర్లు అడిగిన వెంటనే అందుబాటులో ఉండటం గమనార్హం. కేవలం సామాన్య వినియోగదారుల పట్ల మాత్రమే ఏజెన్సీలు వివక్ష చూపుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో సాగుతున్న ఈ గ్యాస్ అక్రమాలను అరికట్టాలని అదనపు వసూళ్లకు పాల్పడుతున్న డెలివరీ బాయ్స్ మరియు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను పులివెందుల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకం కూటమి ప్రభుత్వ ఉగాది కానుక: ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి




**ప్రొద్దుటూరు,మన జన ప్రగతి మార్చి 18:-** దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకం కూటమి ప్రభుత్వ ఉగాది కానుక అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నందు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో కలిసి బస్సులో రాజుపాలెం వరకు ప్రయాణించి దివ్యాంగులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసిందన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకాన్ని ఉగాది కానుకగా ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని వివరించారు. దివ్యాంగులను అన్ని రంగాల్లో సమానంగా ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి దివ్యాంగుడు ఆత్మ విశ్వాసంతో, గౌరవంగా జీవించేలా చేయడమే చంద్రబాబు నాయుడు సంకల్పం అని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కడప జిల్లా పరిషత్ సిఈఓ & ప్రొద్దుటూరు ప్రత్యేక అధికారి ఓబులమ్మ, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహమ్మద్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, డిఎల్డిఓ రామాంజనేయులు, ఆర్టీసి డిపో మేనేజర్ గంగాధర్, ఎంపిడివొ సూర్యనారాయణ రెడ్డి, టీడీపీ కడప జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.యస్ జబీవుల్లా, టిడిపి పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, ఇవి సుధాకర్ రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ మాజీ చైర్మన్ కామిశెట్టి బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, వద్ది బాలుడు, బచ్చల ప్రతాప్, పగిడాల దస్తగిరి బిజేపి పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, జనసేన నాయ కులు సుంకర మురళీ, బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు ప్రసాద్, జిలాన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ అటెండర్ ఇస్మాయిల్ సేవలు అభినందనీయం

### శాలువాతో సత్కరించిన మాజీ చైర్మన్ వరప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ హఫీజ్

### ఇస్మాయిల్ నివాసానికి వెళ్లి దుస్తుల పంపిణీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 18:-** పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్న ఇస్మాయిల్ చేసిన సేవలను గుర్తిస్తూ బుధవారం ఆయనకు ఘన సత్కారం జరిగింది. మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్,మాజీ వైస్ చైర్మన్ హఫీజ్ లు నేరుగా ఇస్మాయిల్ నివాసానికి వెళ్లి ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఇస్మాయిల్ అందించిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. కౌన్సిల్ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ప్రతి ఒక్కరి పట్ల మర్యాదపూర్వకంగా ఉంటూ తన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించారని వారు తెలిపారు. నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులను గౌరవించుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని,ఇస్మాయిల్ సేవలు మరువలేనివని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి,ఖాదర్ బాషా మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు. ఒక సాధారణ ఉద్యోగి చేసిన సేవలను గుర్తించి,ఉన్నతాధికారులు మరియు ప్రజాప్రతినిధులు సత్కరించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శింగనమల వైఎస్సార్సీపీలో ముగ్గురు 'ధృవతారలు'

### పార్టీ బలోపేతమే లక్ష్యంగా సీనియర్ నేతల అడుగులు



**శింగనమల మన జనప్రగతి మార్చి 18:-** శింగనమల నియోజకవర్గం వైయస్సార్సీపి సమన్వయకర్త మాజీ మంత్రి సాకే శైలజనాథ్ గెలుపు కోసం శ్రమిస్తున్న నాయకులు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కీలక నియోజకవర్గాల్లో ఒకటైన శింగనమలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో గట్టి పట్టు ఉంది. నార్పల సత్యనారాయణ రెడ్డి, తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, మరియు గార్లదిన్నె నారాయణరెడ్డి వంటి సీనియర్ నాయకులు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలం నుండి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వీరు, ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నార్పల సత్యనారాయణ రెడ్డి:లి నార్పల మండలంలో ఈయనకు తిరుగులేని పట్టు ఉంది. స్థానిక సమస్యల పరిష్కారంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. తరిమెల వంశీ గోకుల్ రెడ్డి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుండి వచ్చిన వంశీ గోకుల్ రెడ్డి, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో విజయం సాధించారు. నియోజకవర్గ స్థాయి రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, క్లిష్ట సమయాల్లో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారు. గార్లదిన్నె నారాయణ రెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నారాయణ రెడ్డి, గార్లదిన్నె మండల పరిధిలో పార్టీ వ్యూహకర్తగా గుర్తింపు పొందారు. సీనియర్ నాయకుడిగా అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

# ఉరవకొండ ఎస్సీ హాస్టల్‌లో అస్తవ్యస్తత

### వార్డెన్ షరీఫ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి: ఏఐఎఫ్‌డీఎస్ డిమాండ్




**ఉరవకొండ,మన జనప్రగతి మార్చి 18:-** ఉరవకొండ పట్టణంలోని బాలుర కళాశాల ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల ఆరోగ్యం మరియు పరిశుభ్రతను గాలికి వదిలేసిన వార్డెన్ షరీఫ్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్ధు, జిల్లా అధ్యక్షుడు నందు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వసతి గృహంలో నెలకొన్న దుస్థితిపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య ఆరోపణలు మరియు విమర్శలు:ప్రభుత్వం వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశిస్తున్నా, వార్డెన్ షరీఫ్ మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని నేతలు మండిపడ్డారు. హాస్టల్‌కు రావడం కూడా "అత్తగారింటికి అల్లుడు వచ్చినట్లు" అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. మరుగుదొడ్లు, గదుల నిర్వహణ అధ్వానంగా ఉందని, కనీసం లోపలికి వెళ్లి పరిశీలించకుండానే బయట నుండే వెనుతిరుగుతున్నారని ఆరోపించారు. కేవలం జీతం వస్తే చాలు అనే ధోరణితో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని విమర్శించారు. హాస్టల్ లోపల విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాల కంటే, బయట వ్యక్తులకు సరుకులు ఇస్తూ కాలక్షేపం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అధికారులకు హెచ్చరిక:విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అధికారులు స్పందించని పక్షంలో, విద్యార్థులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐఎఫ్‌డీఎస్ నేతలు హెచ్చరించారు.

# ఏఐయస్‌యఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా ఉరవకొండ నేత 'తగ్గుపర్తి చందు' ఎన్నిక



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 18:-** విశాఖపట్నంలో జరిగిన భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర సమితి సమావేశాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన యువ విద్యార్థి నాయకుడు తగ్గుపర్తి చందును ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగిన ఈ సమావేశాల్లో రాష్ట్ర నాయకత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కృతజ్ఞతలు మరియు తన ఎన్నికపై తగ్గుపర్తి చందు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఏఐయస్‌యఫ్ రాష్ట్ర నాయకత్వానికి, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామికి మరియు జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నిక పట్ల ఉరవకొండ నియోజకవర్గ విద్యార్థి నేతలు మరియు ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ చందుకి శుభాకాంక్షలు తెలిపారు.

# పత్తికొండలో దివ్యాంగ శక్తి కార్యక్రమం



**పత్తికొండ మన జన ప్రగతి మార్చి 18 :-** పత్తికొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో "దివ్యాంగ శక్తి" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కూటమి పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు హాజరయ్యారు. టిడిపి నాయకులు సాంబశివ రెడ్డి గ్రంథాలయం చైర్మన్ తుగ్గలి నాగేంద్ర బిజెపి నాయకులు పత్తికొండ కరణం నరేష్ మరియు కర్నూలు ఆర్టీసీ పి.ఓ రామకృష్ణ చేతుల మీదుగా దివ్యాంగ శక్తి టికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ప్రయాణ సౌకర్యాలు మరింత సులభతరం అవుతాయని నాయకులు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ పథకం దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిజెపి నాయకులు జనసేన నాయకులు పత్తికొండ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మాలేఖర వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రంలో వైద్య శిబిరం పరిశీలన



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18: -** బొమ్మనహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. చల్లా శ్రీలక్ష్మి తన సిబ్బందితో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలకు హాజరైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలుతీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచాలని,విద్యార్థులకు తక్షణ వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎన్. ఈశ్వరయ్య,హెల్త్ సూపర్వైజర్ రుక్మిణి,మలేరియా అధికారి భీమా తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ముస్లిం సోదరులకు రంజాన్ ఇఫ్తార్ విందు



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 18:-** పవిత్ర రంజాన్ మాసంసందర్భంగా బొమ్మనహాల్ మండల కేంద్రంలోని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున,కొత్తపల్లి మహేంద్ర, కొత్తపల్లి శ్రీనివాసులు,కొత్తపల్లి క్రిష్టప్ప, పి.నాగరాజు. ఉంతకల్ డీలర్ ఖాషిం వలి అందరూ కలిసి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులు విందును ఆరగించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడుతూ.. రంజాన్ మాసం అనేది శాంతి, సహనం,దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని,సమాజంలో సౌహార్దం మరియు సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి జీవించాలనే సందేశాన్ని రంజాన్ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ముస్లిం సోదరులకు మత పెద్దలు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
19 -03-2026

# లాభసాటి వ్యవసాయమే లక్ష్యం: మంత్రి సవిత

**'రైతన్న మీకోసం' రైతులకు ఎంతో లబ్ధి**

**మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు**

**ఏయే పంటలు వేయాలో వివరించనున్న నిపుణులు**

**రాయలసీమను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదే.**

**సీమ ప్రాజెక్టులపై చర్చకు రండి...**

**జగన్‌కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్**





**గోరంట్ల మన జనప్రగతి మార్చి 18:-** రూ.30 కోట్లతో రాయలసీమను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా తీర్చిదిద్దనున్నామని, దీంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో పండ్ల తోటల సాగును పెంచి, ఉద్యానవన రైతులకు అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యాలను కల్పించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి మార్చాలన్న లక్ష్యంతోనే రైతన్న మీ కోసం కార్య క్రమాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమానికి మంత్రి సవిత బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులతో మంత్రి సవిత రైతుల ఇళ్లకు వెళ్లి, ఏయే పంటలు వేస్తే డిమాండ్ ఉంటుందో వివరించారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. ఈ నెల 13న మూడో అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6 వేలు చొప్పున్న రూ.2,676 కోట్లు జమ చేశామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు ఏటా రూ.20 వేల చొప్పున్న 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.8,985.41 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాల్లో 2.65 లక్షల మంది రైతులకు రూ.360 కోట్లు జమ చేశామన్నారు. పెనుకొండ నియోజక వర్గంలో 45 వేల మందికి రూ.58 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సీఎం చంద్రబాబు రైతు పక్షపాతి అని కొనియాడారు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్న ఉద్దేశంతో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మార్కెట్ లో డిమాండ్ అనుగుణంగా రైతులు పంట సాగు చేసేలా చైతన్యపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యవసాయాధికారులు, నిపుణులు ఏయే పంటలు సాగు చేయాలి... ఏ మోతాదులో ఎరువులు వినియోగించాలి...? అనే వివరాలను రైతులకు వారు వివరిస్తారని మంత్రి సవిత తెలిపారు. **గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా రాయలసీమ** రాయలసీమకు సాగు, తాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. కృష్ణా జలాలను హంద్రీనీవా ద్వారా కుప్పానికి, మడకశిరకు సాగు, తాగునీటిని ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. రూ.30 వేల కోట్ల గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా రాయలసీమను తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో పండ్ల తోటల సాగును పెంచి, ఉద్యానవన రైతులకు అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యాలను కల్పించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రానున్న మూడేళ్లలో రాయలసీమ రూపు రేఖలు మారిపోవడం ఖాయమని మంత్రి సవిత ధీమావ్యక్తం చేశారు. **రాయలసీమ ప్రాజెక్టుల చర్చకు రెడీ...** రాయలసీమను రతనాల సీమగా మార్చాలని అన్న ఎన్టీఆర్ సంకల్పించారని మంత్రి సవిత తెలిపారు. ఆయన స్ఫూర్తి తో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు... సీమకు తాగు, సాగునీరందించడానికి విశేష కృషి చేస్తున్నారన్నారు.రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.2,011 కోట్లుమ మాత్రమే ఖర్చుచేసి ఒదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 21 నెలల కాలంలో రూ.6,800 కోట్లు వెచ్చించామన్నారు. రాయలసీమలో సాగు, తాగునీటి కల్పన ఏ ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందో చర్చకు రావాలని జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయం

**• ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ అభినందనలు**



**విజయవాడ,మన జనప్రగతి మార్చి 18:-** ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టులందరికీ మీడియా అక్రిడిటేషన్స్ అందించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారుల పనితీరు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్‌పేట ప్రాంతంలో ఉన్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, ఎన్టీఆర్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు యేమినేని వెంకటరమణ ఆధ్వర్యంలో విజయవాడ నగర అధ్యక్షుడు తాళ్లూరు అనిల్ కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఏపీఎంపీఏ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, కోట రాజా తదితరులు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులను కలిసి దుశాలువాతో సన్మానించారు. జర్నలిస్టుల పట్ల అధికారులు చూపిన సానుకూల దృక్పథం, పారదర్శక విధానాన్ని ప్రశంసిస్తూ సంఘం నాయకులు తమ కృతజ్ఞతలు తెలిపారు. వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందజేయడం అనేది కేవలం పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా, మీడియా రంగానికి ప్రభుత్వ గుర్తింపు, ప్రోత్సాహం అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ ప్రక్రియను వేగవంతంగా, నిష్పక్షపాతంగా అమలు చేయడంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీషా పర్యవేక్షణలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు కీలక పాత్ర పోషించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా డిపిఆర్ఓ రమణ, డివిజనల్ పి.ఆర్.ఓ.రవి,మరియు ప్రసాద్ తదితర అధికారులు జర్నలిస్టులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి వర్కింగ్ జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకోవడం అభినందనీయం కమిటీ సభ్య యేమినేని వెంకట రమణ పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వర్గమని, వారి పనితీరుకు సరైన గుర్తింపు లభించడం అవసరమని ఆయన అన్నారు. అక్రిడిటేషన్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు అధికారిక గుర్తింపు లభించడంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కలుగుతుందని, సమాచార సేకరణలో సౌలభ్యం పెరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు జర్నలిస్టు సంఘాల సభ్యులతో పలుమార్లు చర్చలు జరిపి, అర్హత ప్రమాణాలను స్పష్టంగా నిర్ధారించి, ప్రతి అర్హుడైన జర్నలిస్టుకి అక్రిడిటేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో పారదర్శకతను పాటించడం, ఎటువంటి వివక్ష లేకుండా వ్యవహరించడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో, వారి వృత్తి అభివృద్ధికి సహకరించడంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఎల్లప్పుడూ ముందుండుతుందని అధికారులు హామీ ఇచ్చారు. జర్నలిస్టులు మరియు ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర అవగాహన, సహకారం పెరిగితే సమాజానికి మరింత నాణ్యమైన సమాచారాన్ని అందించగలమని వారు అభిప్రాయపడ్డారు. మొత్తంగా, ఎన్టీఆర్ జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ప్రభుత్వం, అధికారులు మరియు మీడియా వర్గాల మధ్య మంచి అనుబంధం నెలకొన్నదని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ఇది భవిష్యత్తులో కూడా మీడియా-ప్రభుత్వ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగుగా భావించవచ్చు.

# కృష్ణయ్య కలం.. కవితలకు సలాం పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

**పులివెందుల టౌన్ మన జనప్రగతి మార్చి 28:-**సీనియర్ జర్నలిస్ట్ దేరంగుల కృష్ణయ్య రచించిన "కృష్ణయ్య కలం ..కవితలకు సలాం" అనే పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి బుధవారం ఆవిష్కరించారు. స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ జర్నలిస్ట్ కృష్ణయ్య తనకు మిత్రుడని ఆయనలో కవితలు రచించే మరో కోణం ఉందని తెలిసి ఆశ్చర్యపోయాను అన్నారు. సమాజానికి ఉపయోగపడే ఎన్నో కవితలను ఆయన రచించి పుస్తకా రూపంలో తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. మరిన్ని కవితలను ఆయన రచించి సమాజానికి మేలు చేయాలని పేర్కొన్నారు. అలాగే మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి స్వయంగా పులివెందులకు వచ్చి జర్నలిస్ట్ కృష్ణయ్య రచించిన కవితా సంకలనాన్ని అందుకుని ప్రశంసించారు.ఈ సందర్భంగా కృష్ణయ్యను అభినందిస్తూ తెలుగు భాషా సాహిత్యానికి మరింత సేవ చేయాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి పేర్ల పార్థసారధి రెడ్డి, ఉపాధ్యాయనేత అంగడి నాగేంద్ర ,శ్రీకృష్ణదేవరాయ ఫౌండేషన్ చైర్మన్ అల్లం రంగనాయకులు రాయల్, మాజీ డిఈ పుల్లారెడ్డి ,రిటైర్డ్ ప్రిన్సిపల్ అంకిరెడ్డి,ట రిటైర్డ్ ఉపాధ్యాయులు పిటి డివి కొండారెడ్డి, రొటేరియన్ నాగేశ్వర్ రెడ్డి, కవులు నక్కలపల్లి కొండారెడ్డి, సీనియర్ జర్నలిస్టు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకృష్ణ ఆలయ నిర్వాహకులు ధరణి రమణ, రెడ్డి సైరా భాను, సర్ఫ్ ఏపిఎం ఆంజనేయులు, ఉపాధ్యాయ నేత అంగడి నాగేంద్ర పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం -ఫోర్ వీల్ ఆటో 'ఢీ'...వ్యక్తికి గాయాలు

**• రోడ్డు మరమ్మతుల మధ్య ప్రమాదం • గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలింపు**



**తొండూరు మన జనప్రగతి మార్చి 18:-** మండల పరిధిలోని మదూరు గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం మరియు ఫోర్ వీల్ ఆటో ఢీకొన్న ఘటన గురువారం చోటుచేసుకుంది.ఈ విషయంపై స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన గుజ్జుల రామచంద్రుడు తన ద్విచక్ర వాహనంపై పులివెందుల నుండి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందనీ,మదూరు సమీపంలో రోడ్డు మరమ్మతులు జరుగుతుండటంతో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించబోయిన రామచంద్రుడు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడం జరిగిందన్నారు. అయితే ఈ ప్రమాదంలో రామచంద్రుడికి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి అతన్ని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



# ప్రశాంతంగా రెండవరోజు పదవ తరగతి హిందీ పరీక్ష

**- 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు**



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 18:-** మండల పరిధిలోని రెండవ రోజు జరిగిన హిందీ పరీక్ష నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 979 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా,957 మంది విద్యార్థులు హాజరయ్యారు.22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారనీ మండల విద్యాశాఖాధికారులు వీరన్న, మల్లికార్జున,తెలియజేశారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో అధికారులు అవసరమైన తాగు నీరు ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసూల్ వారి సిబ్బందితో కలిసి పర్యవేక్షణ చేపట్టారు.విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయడానికి అనుకూల వాతావరణం కల్పించారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**- పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**



**పులివెందుల టౌన్ మన జనప్రగతి మార్చి 18:-**ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమైన దృష్ట్యా, పులివెందుల మండలం మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు రాబోయే మూడు నెలల పాటు ఎలాంటి తాగునీటి ఎద్దడిని ఎదుర్కోకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరుతున్నాను. ఎక్కడా కూడా నీటి కొరత తలెత్తకుండా తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. అలాగే, పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పారిశుధ్య లోపం వల్ల ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకుండా వారి ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఒక సాధారణ గృహిణిగా నీటి సమస్య వల్ల ఇంటి దగ్గర ఎదురయ్యే ఇబ్బందుల పట్ల నాకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. ప్రస్తుతం ఒక ప్రజాప్రతినిధి హోదాలో ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రధాన సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. దయచేసి అధికారులు ఈ విషయాలపై తక్షణమే స్పందించి తగిన పరిష్కారాలు చూపాలని కోరుకుంటున్నాను. ధన్యవాదాలు."

# స్వయం పరిపాలన దినోత్సవం

**దంతాలపల్లి మన జనప్రగతి మార్చి 18:** స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా మేగ్య తండా గవర్నమెంట్ స్కూల్లో సర్పంచ్ గుగులోత్. మంగీలాల్ నాయక్ ఘనంగా నిర్వహించడం జరిగింది తన సొంత ఖర్చులతో పిల్లలకు. ప్రైజ్ లు ఇవ్వడం జరిగింది స్కూల్ హెడ్మాస్టర్ స్కూల్ టీచర్ గ్రామ పెద్దలు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు




PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174